
# మీమాంస

నవులూరి వెంకటేశ్వర రావు



కొవ్వు బలిసిన ఇద్దరు పోలీసులు మోపెడ్‌ను హింసపెడుతూ తెచ్చి, ఆపి, దిగి నాలుగడుగులు వేశారు. డ్రిల్లులు, కసరత్తులు చేసే ఆసక్తి, తీరుబడి వాళ్లకు ఉన్నట్లు కనబడటంలేదు. వందనం ఇంటికి ఎదురుగా వినాయకోత్సవం జరుపుతున్నారు ఆ వీధి పిల్లకాయలు. వాళ్లకు ప్రోత్సాహం, ఆశీస్సులు అందిస్తూ వచ్చాడు వందనం. అతను తెలుగు సినిమా పాటల పిచ్చి అభిమాని. కుర్రాళ్లు తెల్లబోయి, నిలబడి చూస్తూండగా విధినిర్వహణలోకి ఉపోద్ఘాతాలు లేకుండా దిగిపోయారు పోలీసులు.

"వందనంగారూ! ఓ వందనంగారూ!" పిలిచాడు ఒక పోలీసు. గారూ అని పిలవడం భారంగా తోచి మూడోసారి నుంచి ఆ మాట వదిలేసి పిలిచాడు. ఈసారి పిలుపులో మాధుర్యం, ఆప్యాయత ఉన్నాయి. ఆ పిలుపు తీయదనం ఇంటి లోపల ఆయనను నిలువనీయనట్లు బాల్కనీలోకి వచ్చి నిలబడ్డాడు. ఆయనా తెల్లబోయాడు. కిందికి రమ్మని స్నేహితుడిలా చేయి ఊపాడు రెండవ పోలీసు. లుంగీ, బనీన్లలో ఉన్న వందనం పంట్లాం, చొక్కా వేసుకోటానికి లోపలికి వెళ్లాడు మగవాడు కూడా పోలీసు దగ్గర వాడి జాగ్రత్తలో వాడు ఉండాలమని తోచిందేమో. రెండు నిమిషాల్లో కిందున్నాడు.

"అర్జంటుగా మాతో రావాలి!"

"ఎక్కడికి?"

"షికారుకు కాదులెండి, స్టేషనుకు!" (వందనానికి షికారంటే భయమూ, స్టేషనంటే సరదా ఉన్నట్లు!)

"ఎందుకు?"

"ఎస్సైగారు పిలుచుకు రమ్మన్నారు."

"ఆయనతో నాకు ఏ పరిచయమూ లేదే!"

"ఇప్పుడవుతుందిలెండి!"

అదే సమయానికి సాయంత్రం వాహ్యాళి పూర్తి చేసుకుని ఇంటికి చేరబోతున్న కరుణానిధి అక్కడ ఆగాడు.

"చూడండి సార్, స్టేషనుకు రమ్మంటున్నారు వీళ్లు!" ఆయనతో అన్నాడు వందనం, ఆయన వాళ్ల పై అధికారి కాకపోయినా.

"కారణం ఏమిటండీ?" ఆయన అడిగాడు పౌరహక్కుల పోరాట సమితి సభ్యుడిలా కాక, నిష్పక్షపాత వైఖరితో అణువకుగా. అలా కాకపోతే వందనంతోపాటు ఆయనా స్టేషనుకి వెళ్లవలసి రావచ్చు. ఆ ప్రశ్నలో వేరే భావాలు వ్యక్తమయ్యాయి. ఏ కారణం లేకపోయినా తీసుకెళ్లే హక్కు మీకు ఉంది. 'ఏ కారణం లేదు. అయినా తీసుకెళ్తున్నాం' అనైనా సరే ఏదో ఒక సమాధానం చెబితే అదే పదివేలు.

ఆ ధోరణిని అర్థం చేసుకున్నవారై వాళ్లు సమాధానం ఇచ్చారు "సీపీ గారు ఎస్సైగారితో వైర్‌లెస్ సెట్లో మాట్లాడారు. వందనం అనే ఈ కాలనీ వ్యక్తిని తెచ్చి స్టేషన్లో ఉంచమన్నారు. ఆ దొరగారే స్వయంగా ఇంటరాగేట్ చేస్తానన్నారు!"

"విషయమేమిటో?" కరుణ అడిగాడు.

"మీరు వచ్చి ఎస్సైగారిని అడగండి!"

వాళ్లిద్దర్లో ఒకడు మోపెడ్ ఎక్కాడు. రెండోవాడు వందనం స్కూటర్ వెనుక సీటు ఆక్రమించాడు.

"చూడండి, సార్!" అన్న వందనం మాటల్లోని బేలతనానికి గుండె కరిగి ఉన్న కరుణ త్వరత్వరగా అడుగులు వేస్తూ సుదర్శనం ఇంటికి వెళ్లాడు. వాళ్లిద్దరూ కలిసి గంగాధరం ఇంటికెళ్లారు. వాళ్లు ముగ్గురూ సుబ్బయ్య ఇంటికి వెళ్లారు.... మరో అరగంటలో మొత్తం పదిమంది కూడి స్టేషనుకు వెళ్లారు. ఒక మూల స్టూలు మీద కూర్చుని ఉన్నాడు వందనం. వీళ్లందరినీ చూడగానే ప్రాణం లేచి వచ్చింది. వీళ్లు అలా వెళ్లారో లేదో, అంతవరకూ వాళ్లకు తన దర్శనభాగ్యం కలిగించటానికే ఆగి ఉన్నట్లు కుర్చీలోనుంచి లేచి స్టేషను ఆవరణలో ఉన్న మోటరు సైకిల్‌వైపు నడిచాడు ఎస్సై. "పోవుచున్నావా..." అంటూ వెంటబడినట్లు వడివడిగా అతని వెనుకే నడిచారంతా.

"ఏం సార్, వందనాన్ని స్టేషనుకు ఎందుకు పిలిపించారో తెలుసుకోవచ్చునా?" సుబ్బయ్య అడిగాడు.

"మా వాళ్లు చెప్పే ఉంటారు గదా, సీపీగారు ఆయన్ని స్టేషన్లో ఉంచమన్నారు. మురికివాడలో నేరస్తుణ్ని స్టేషనుకు తెస్తే ఆ జనమంతా వచ్చినట్టు ఇంతమంది వచ్చారేంటి?"

బండి దూసుకుపోయింది.

"సుబ్బయ్యగారూ, మీకు ఏసీపీ తెలుసుగా. ఆయనతో ఫోనులో మాట్లాడకూడదూ?" సుదర్శనం అడిగాడు.

రెండు స్కూటర్లమీద నలుగురు ఇంటిదారి పట్టారు. సుదర్శనం ఇంటిముందు ఆపి లోపలికి దూరాడు. సుబ్బయ్య ఏసీపీకి ఫోను చేశాడు.

"సీపీ చెప్పారని మా వాళ్లు అన్నారని మీరు చెబుతున్నారు గదా. అలాంటప్పుడు నేనేం చెయ్యగలను బ్రదర్?"

సుబ్బయ్య, కరుణ, సుదర్శనం, చంద్రారావు ఎదురెదురుగా కూర్చుని ఒకరినొకరు మౌనంగా చూస్తూ గడిపారు. వాళ్ల అసమర్థతకు వాళ్లకే సిగ్గేసింది. నిజంగానే నాగరిక ప్రపంచంలో, ప్రజాస్వామిక వ్యవస్థలో జీవిస్తున్నామా అన్న అనుమానం బాధించింది. మౌనంగానే ఉన్నా వాళ్లందరిలో ఒకేలాంటి భావాలు మెదిలాయి. ఇది చాలా చిన్న వ్యవహారంలా తోస్తోంది. అలాంటప్పుడు ఎందుకు ఏమీ చెయ్యలేకుండా ఉన్నాం అన్న ప్రశ్న తోస్తోంది. ఏమీ చెయ్యలేకుండా ఉన్నాం కాబట్టి ఇది నిజంగా చిన్న వ్యవహారం కాదేమో అన్న అనుమానమూ ఒక మూల పుండులా సలుపుతోంది. నాగరిక సమాజం అనాగరిక చర్యలను అరికట్టడానికి, వాటినుంచి తనను తను రక్షించుకోడానికీ ఏర్పరచుకున్న పోలీసు వ్యవస్థ ఒక చిన్న విషయంలోనే అక్రమానికి పాల్పడితే దానినుంచే రక్షణ అవసరమవుతోంది. ఒకరినొకరు చాలినంత చూసుకున్న తర్వాత విసుగేసింది. ఆలోచన నుంచి మాటలు కొంత ఉపశమనాన్నిస్తాయని అనిపించింది.

"మైకు న్యూసెన్స్ కిందే అతన్ని తీసుకెళ్లారని నాకు తోస్తోంది!" సుదర్శనం అన్నాడు.

"కమిషనర్ జోక్యం చేసుకున్నాడంటే ఇది అంత చిన్న కేసయ్యుండదు!" సుబ్బయ్య అభిప్రాయపడ్డాడు.

"కమిషనర్ పేరు ఇందులోకి లాగితో ఛోటా పోలీసు అధికారుల నుంచి సిఫారసులు తేరని ఆ ఎత్తుగడ ఎత్తి ఉండవచ్చు!" సుదర్శనం అన్నాడు.

"ఇది ఏం కేసో మనం తెలుసుకోవాలంటే కూడా, భగవంతుడికై తపస్సు చేసి అడగాలేమో?" కరుణ కంఠంలో వ్యంగ్యం.

"చేతకానివాళ్లలా, మూలనుండి ముసలమ్మల్లా ఒళ్లో చేతులు పెట్టుకుని మీనమేషాలు లెక్కట్టుకోవడమేనా, చేసేదేమన్నా ఉందా?" ప్రశ్నించాడు చంద్ర.


"చేయగలిగింది చేశాం కదా!"

"అసలు ఏం చేశాం కనుక ఒక్క ఫోనుకాల్ చేయటం మినహా."

"వందనం భార్య గుండె పట్టుకుని పడుకుండిపోయింది. అసలే రక్తపోటు. బిక్కమొహాలేసుకుని పిల్లలు తలా మూలా కూర్చుండిపోయారు. మా ఆవిడను తోడిచ్చి ఆవిడను ఆస్పత్రికి పంపాను."

సుబ్బయ్యకూ ఉద్రేకం, రక్తపోటు వచ్చాయి.

"డి.సి.పి.కి ఫోన్ చేస్తాను. అతనితో కలిసి ఎప్పుడూ మందు కొట్టలేదు, పేకాడలేదు, వ్యభిచరించలేదు, ఎలాంటి మరో పరిచయమూ లేదు. కనీసం నా కులంవాడు కాదు. అయినా ఫోన్



చేస్తాను. ఎదురుగా లేను కాబట్టి కోపంలో లాఠీ విసరటానికీ, బూటుకాలు ఝాడించటానికీ వీలు లేదు!"

డైరెక్టరీ తీసి చూసి నంబరు డయల్ చేశాడు. చేస్తున్నప్పుడు ఉద్రేకంతో వేళ్లు వణికాయి. ఆయన దొరికాడు. ఇతను అంతా చెప్పాడు. ఆయన అంతా విని, ఏదో అని ఫోను పెట్టేశాడు.

"విషయమేమిటో కనుక్కుంటానన్నాడు. ఉద్రేకపడటం ఆరోగ్యానికి మంచిది కాదన్నాడు. మరి నా ఆరోగ్యం సంగతి ఎలా తెలిసిందో? మాటల్లో మంచితనం ఉంది. ఆయనను ఖాకీ దుస్తులు పాడుచేసినట్లు లేవు!" ఉద్రేకం, బి.పి. తగ్గిపోయిన సుబ్బయ్య అన్నాడు.

"తొందరపడి ఒక అభిప్రాయానికి రాకండి. తీయటి మాటలు కాదు కావాల్సింది, పని జరగాలి!" చంద్ర అన్నాడు.

పన్నెండు దాటిన తర్వాత వందనం ఇంటికి చేరాడు. అంగవైకల్యం కలగలేదు. మానభంగం అవలేదు. పంచప్రాణాల్లో ఒక్కటీ పోలేదు. పోలీసులలోనూ మనుషులుంటారు. అతను ఒక జీవితపాఠం నేర్చుకున్నాడు. అది స్వేచ్ఛ ఎంతటి తీయనైనదో, విలువైనదో నేర్పింది. అయితే ఒక సందేహం ఉండిపోయింది. అతడి విలువైన స్వేచ్ఛను సరైన కారణం లేకుండా హరించిన నేరానికి శిక్ష ఉండదా?

మరునటిరోజు పొద్దున ఆరుగంటలకు మార్నింగ్ వాక్ ము‌గించి వస్తూ కరుణానిధి చంద్రరావు ఇంటిముందు ఆగాడు. నిద్ర వదలని కళ్లతో ఆయన ఆంగ్ల దినపత్రిక పేజీల్లో ఏదో విలువైనదాని గురించి వెదుకున్నాడు.

"చంద్రంగారూ! వందనంగారి వ్యవహారమంతా రాత్రంతా నన్ను కలవరపరిచింది. సరిగా నిద్ర పోలా. స్వేచ్ఛను ప్రేమించే మనకు అది ఒక సవాల్‌గా అనిపించింది. మన అసమర్థత బాధించింది. నిన్న ఆయనయ్యాడు. రేపు నేనో, మీరో కావచ్చు. ఎవరు చెప్పొచ్చారు? స్టూలు మీద కూర్చోబెట్టే బదులు కటిక నేలమీద కూర్చోబెట్టవచ్చు. లేదా గోడకుర్చీ వేయమనవచ్చు. లాఠీకో, బూటుకో వాళ్లు పని కల్పించవచ్చు. మనమెరుగని బూతుల వర్షంలో మనల్ని తడిపెయ్యవచ్చు. ఆ అనుభవాల ఊహలు నాలో ఒణుకులు పుట్టించాయి, వెన్ను చల్లబడింది. మనం ఊరుకోవద్దు. సీపీ ముంగిటికే ఈ వ్యవహారం తీసుకెళ్తే బావుంటుందని నా అభిప్రాయం. మీరేమంటారు?"

"మీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. పోలీసు కమిషనర్‌కి ఉత్తరం రాసి సాయంత్రం తెస్తాను. రేపు మామిడితోపులో అందర్నీ సమావేశపరుద్దాం. ఆ ఉత్తరం మీద అందరి సంతకాలు తీసుకుందాం. కొందరం వెళ్లి ఆ ఉత్తరాన్ని స్వయంగా, సవినయంగా అందచేద్దాం. ఇంతకంటే మరో మంచి ఆలోచన మీకొస్తే చెప్పండి!"

మరో మంచి ఆలోచన రాని కరుణ, చంద్రం చెప్పిన దానికి తల ఊపి వెళ్లిపోయాడు.

మరసటిరోజు ఆదివారం. తొమ్మిది గంటలకు మామిడి చెట్ల కింద కుర్చీలు వేసుకుని కూర్చుని సమావేశాన్ని ఆరంభించారు.

ఉపోద్ఘాతం అయిన తర్వాత, "సీపీకి రాసిన ఉత్తరం చంద్రం చదువుతారు. విన్న తర్వాత ఎవరి అభిప్రాయం వాళ్లు నిరభ్యంతరంగా చెప్పవచ్చు!" అని కరుణ అన్నాడు.

చంద్రరావు చదివాడు. చదవడం పూర్తయిన తర్వాత కొంతసేపు మౌనం దాల్చి, చర్చ మొదలుపెట్టారు.

"పిటీషనులో ఆ యూనివర్సిటీ ఉద్యోగిమీద మనకు అనుమానం ఉన్నట్లు రాయకపోతే మంచిది. వినాయకోత్సవంలో ఆంప్లిఫైర్ లైసెన్సు లేకుండా, ఇంతరులకు ఇబ్బంది కలిగేలా వాడటం వలనే ఈ గొడవ వచ్చిందని నా నమ్మిక. పైగా వందనంగారు అటుమొన్న స్వహస్తాలతో తారాజువ్వలు వదిలి, బాణసంచా కాల్చారు. దానిమీద ఆ ఉద్యోగికి ఇబ్బంది కలిగి ఫిర్యాదు చేసి ఉండవచ్చు. అది తప్పని మనం ఎలా అనగలం? మరొకరిని బాధించే హక్కు మనకు లేదే! మన స్వేచ్ఛా సరిహద్దు అవతలివాడి ముక్కుకు ఇవతల అంతం అవుతుంది. అలా అని పెద్దలన్నారు!" ధర్మయ్యగారు అన్నారు.

"ఇంట్లో వాడుకునే స్టీరియో స్పీకర్లవి. యూనివర్సిటీ ఉద్యోగి ఇల్లు తూర్పు ముఖంగా రెండొందల గజాల దూరంలో ఉంది. ఈ స్పీకర్లు పశ్చిమంవైపు మళ్లించి ఉన్నాయి. ఆ ఇంట్లోని పాము చెవుల వ్యక్తిని కూడా అవి ఏ విధంగానూ బాధించవు. అందువల్ల ఆ ఉద్యోగికి ఎలాంటి ఇబ్బంది లేదు. అలాంటప్పుడు అతను అలా ఫిర్యాదు చేయటం శోచనీయం."

## పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం

తెలుగు సాహిత్యంలో ప్రామాణిక గ్రంథ రచనను ప్రోత్సహించే ఉద్దేశంతో కొన్నిశీర్షికలు ప్రకటించి, పోటీలో గెలుపొందినవాటికి నగదు బహుమతి రు.10,000/- ఇవ్వడంతోబాటు వాటిని విశ్వవిద్యాలయమే ప్రచురిస్తుందనీ, 1999కి గాను (1) స్వాతంత్ర్యానంతర తెలుగుకవిత-వస్తువు రూపం, శిల్పం; (2) ఈ శతాబ్ది తెలుగుకథ- తెలుగుదనం అనే రెండు శీర్షికలను ఎంపికచేసి నట్లు; వీటిని ఫుల్‌స్కేప్ కాగితంమీద 250 పేజీ లకు తగ్గకుండా 31-1-2000 తేదీలోపు పంపా లని, ఇతర వివరాలను డిప్యూటీ రిజిస్ట్రార్, విస్తరణ సేవావిభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, పబ్లిక్‌గార్డెన్స్, నాంపల్లి, హైదరా బాదు-500 004 చిరునామాకు రాసి తెప్పించు కోవచ్చని విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు తెలియజేస్తున్నారు.

"చంద్రంగారూ! మీ వాదనలో ఒక లోపం ఉంది. ఆ బాక్సుల వలన ఆ ఉద్యోగికి ఎలాంటి న్యూసెన్సూ లేదు కాబట్టి ఆయన ఏ ఫిర్యాదూ చేసి ఉండకపోవచ్చు అని కూడా భావించవచ్చు."

"మైకు న్యూసెన్సు కారణం కాద అనుకుంటే మరి ఏ కారణం వలన ఆయనను పోలీసులు తీసుకెళ్లినట్లు? ఎవరు ఫిర్యాదు చేసినట్లు?"

"మరో కారణం కానీ, మరో వ్యక్తి కానీ కనబడటంలేదు. అతను అనుమానించదగిన వ్యక్తే అన్నది అతని చరిత్ర సూచిస్తోంది. చీటికీ మాటికీ పోలీసుకు ఫిర్యాదు చేయటం అతని అలవాటు. నాకు తెలిసి గతంలో మూడుసార్లు పోలీసులను పిలుచుకొచ్చాడు. ఆడపిల్లలు కొందరు కలిసి రెండు కర్రలు పాతి ఊయల కట్టుకుని అట్లతద్దినాడు ఊగుతుంటే పోలీసులను పిలిపించి ఆ రెండు కర్రలు పీకించేశాడు. ఆ ఊయల తన ఇంటికి వెళ్లే దారిలో అడ్డంగా ఉందట. ఇంటిపక్క ఎవరో గేదెను కట్టేస్తున్నారని పోలీసు సహాయం కోరాడు. ఇంటి మేస్త్రీ పది రూపాయలు ఎక్కువ అడిగాడని పోలీసులకు ఫిర్యాదు చేసి వాళ్లని రప్పించాడు. అతను ఇల్లు కట్టుకుని దిగిన మూడు నెలల్లో మూడు ఫిర్యాదులు! ఈ వంద ఇళ్ల లొకాలిటీలో పోలీసు పికెట్ పెట్టి శాంతిభద్రతలు భంగపడకుండా చూడమని సీపీకి అతను ఒక వినతిపత్రం ఇచ్చినట్లు వినికిడి."

"డాన్‌లో కుర్రాళ్లు ఉత్సవం చేసుకోటానికి చందాలెత్తారు. వందనంగారు వేయి రూపాయల చందా ప్రకటించి ఏడొందలే ఇచ్చారట. ఆ కోపంతో ఈ వీథిలో తన ఇంటిముందు విగ్రహం పెట్టించి, స్టీరియోలు మోగించి, బాణసంచా కాల్చి వందనంగారు న్యూసెన్సు చేస్తున్నారని ఆ కుర్రాళ్లు కంప్లైంట్ చేసుంటారని నా నమ్మకం."

"వేయి రూపాయలిస్తానన్న మాట నిజం. ఏడొందలే ఇచ్చింది మరో నిజం. దక్కిన ఏడొందల మాట మరచి దక్కని మూడొందల గురించి కక్ష కడతారా?"

"అది అలగా గుంపు. గంపుకు మెదడుండదు. తర్కం అన్న మాటకు వాళ్ల భాషాజాలంలో చోటుండదు. గుంపును నడిపించేది ఆవేశం ఒకటే. అలా అని పెద్దలన్నారు."

"ఫిర్యాదు ఎక్స్‌గాడు చేశాడా, వై గాడు చేశాడా అన్నది ముఖ్యం కాదు. నిజమైన ఇబ్బంది వలన చేశాడా లేదా అన్నదీ ముఖ్యం కాదు. ఫిర్యాదు అందిన తర్వాత పోలీసులు చేయవలసిన పని వాకబు చేయటం. అప్పుడు, ఫిర్యాదు పరిగణనలోకి తీసుకోదగినదా కాదా అన్నది తేలుతుంది. అలాంటివేమీ చెయ్యకుండానే వందనంగారిని తోడుకుని వెళ్లి స్టూలుమీద కూర్చోబెట్టారు. సరే, ఎలాంటి ప్రాథమిక సమాచారం రాబట్టకుండానే తీసుకెళ్లారు. బానే ఉంది. అయిదు గంటల కాలంలో ఒక్క ప్రశ్నన్నా వేశారా? లేదే!"

"అంతే కాదు, సీపీ పేరు ఇందులోకి లాగి, పోల్చించి ఏ హత్యో, అత్యాచారామో, అనాచారమో జరిగినట్లు, అందులో వందనం హస్తం ఉన్నట్లు సస్పెన్స్ ఎందుకు సృష్టించాలి? దానివలన వందనాన్నేగాక మనల్నీ ఎంత ఆందోళనకు గురిచేశారు? మైకు న్యూసెన్సని ఒక్క ముక్క అంటే సరిపోయేది. "అంత సున్నితమైన ఆలోచనలుంటే పోలీసు ఉద్యోగం చేయలేరు!"

"సీపీ వాళ్లకు చెప్పనేలేదు అని అసలు మనం ఎలా చెప్పగలం?"

"అంత పెద్ద అధికారి వేలు కాదు గదా, గోరు కూడా పెట్టదగిన వ్యవహారం కాదు ఇది. పైగా డిసీపీతో మనం మాట్లాడిన అరగంటకు వదిలేశారు. సీపీ ఆసక్తి చూపిన కేసే అయితే కింది ఉద్యోగి జోక్యం కలుగజేసుకుని ఉండేవాడు కాదు!"

"మన చర్చ కట్టిపెట్టి, దీన్ని చిన్న విషయంగా భావించకుండా సీపీకి రాసిన ఉత్తరంమీద అందరం సంతకాలు పెట్టడం మంచిది."

"కరుణగారూ! దానిమీద సంతకం పెట్టడం అనేది చాలా తేలికైన విషయం. రెప్పపాటు కాలం చాలు. అయితే ఆ కాగితం వలన ఏ ప్రయోజనాన్ని ఆశిస్తున్నామో ఒక క్షణం ఎక్కువగా ఆలోచించటం, చర్చించటం తప్పు కాదు!"

"ఆ కాగితం ప్రయోజనం మీద నా అనుమానం నాకు ఉంది. వృథా ప్రయాసగా తోస్తోంది. ఆ ఎస్సైమీద కమిషనర్ చర్య తీసుకుంటాడని నమ్మలేకుండా ఉన్నాను."

"తన పేరు ఇలాంటి స్వల్ప విషయంలోకి లాగి తనను అప్రతిష్ఠపాలు చేసినందుకు ఆయనలో స్పందన ఉండదంటారా?"

"పోలీసు వ్యవస్థలో పై అధికారుల ప్రతిష్ఠలు పెరిగే కార్యాలు క్రింది తరగతి ఉద్యోగులు తలపెడతారని ఆయన అనుకుంటుంటే ఆయన్ని సీపి అనడానికి బదులు పీపీ అనాలి. ఇంత 'మామూలు' విషయంలోనూ కింది ఉద్యోగస్తులపై చర్యలు తీసుకుంటే వాళ్ల మనోస్థైర్యం దెబ్బతింటుంది అని పోలీసు పెద్దలు అంటారు."

"అన్నట్లు, తన కులస్తులైన నలుగురు ఎంపీలు, అరడజను ఎమ్మెల్యేలు జేబిలలో గల ఎంపీ గరటయ్యగారి బావమరిది ఈ ఎస్సై. ఇతగాడు నక్సలైట్ స్థావరాలున్న ఏజెన్సీ ప్రాంతంలో ఉండేవాడు. మందుపాతర ప్రేలుడులోనో, ఏకె రైఫిల్ కాల్పులలోనో ఏ క్షణాన్నైనా ప్రాణం హరీ అనవచ్చుని తరచూ పంట్లాం ఖరాబు చేసుకుని క్షణాలు లెక్కబెట్టుకుంటూండగా గాడిద పార్టీని, ఆ పార్టీకి చెందిన గరటయ్య గారిని ప్రజలు గెలపించారు. ఎంపీగా ఎన్నికైన బావగారు చేసిన మొదటి పని బావమరిదిని నగరానికి బదిలీ చేయించటం. ఏజెన్సీలోని పిల్లి నగరంలో పులై తిరుగుతోంది. కావున ఎస్సైగారు సీపీగారికన్నా ఎంతో బలవంతుడు. సీపీ ఎస్సై సంగతి పట్టించుకుంటే, ఎస్సై కూడా సీపీ సంగతి పట్టించుకుని హోమ్‌గార్డ్స్ అధికారిగా బదిలీ

> "మన ముందరసీట్లో ఆయన మొదటిసారిగా విమానంలో ప్రయాణిస్తున్నా డనుకుంటా!" అంది భవాని.
>
> "ఆ విషయాన్ని అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావు?" అడిగాడు ఆనంద్.
>
> "ఎయిర్ హోస్టెస్ చాక్లెట్ తెచ్చిస్తే 'హేపీ బర్త్ డే టు యూ' అని పాట పాడుతున్నాడు." చెప్పింది భవాని.
>
> -పి.వి. మురళీకృష్ణ, హైదరాబాదు

చేయించగలడు. ఏ కోర్టూ సీపీ రక్షణకు రాదు, లా అనుకూలించదు గనుక!"

"ఎస్సైని సస్పెండ్ చెయ్యమని అడగటంలేదు. ఈ అర్జీ బుట్టదాఖలా చేయాలని తమరికి అనిపిస్తే ఆ పని చేసే అధికారం, హక్కూ తమకు ఉన్నాయి మీ నిర్ణయాన్ని శిరసావహిస్తాం అని సవినయంగా మనవి చేశాం. కనీసం మందలించడంటారా ఎస్సైని?"

"మనముందు మందలించటం మాత్రం కల్ల. మన వెనక ఏం చేస్తే మనకు ఒరుగుతుంది?"

అంతవరకూ మౌనంగా వింటూ వచ్చిన స్టాలిన్ బాబుకు చిర్రెత్తుకొచ్చి అన్నాడు.

"సంఘంలో గౌరవంగా బతుకుతున్న సాటి వ్యక్తిని నేరస్తుడిలాగానూ, కారణం అన్నా చెప్పకుండానూ పోలీసు నిర్బంధంలో అయిదు గంటలు ఉంచినందుకు మనం ఉద్యమాలు లేవనెత్తటంలేదు లాఠీ దెబ్బలు తింటామని, కాల్పులు జరుగుతాయని భయపడటానికి. జరిగిన అన్యాయాన్ని పై అధికారికి తెలియచేయడమనే స్వల్పమైన పని చేద్దామనుకుంటున్నాం. ఆ కాగితంమీద చర్య తీసుకుంటాడా, శానిటరీ పేపరుగా వాడుకుంటాడా అని విశ్లేషించటం సిగ్గుపడాల్సిన విషయం. ఈ పని చేయటం వలన మనకు పొయ్యేదేం లేదు ఒక కాగితం తప్ప; వృథా అయ్యేదేం [illegible]ని మీద టైపు చేసిన శ్రమ, సంతకాలకు ఖర్చయ్యే ఇంకు తప్ప!"

రెండు నిమిషాలసేపు అందరూ మౌనంగా గడిపారు. ఆ తర్వాత తెగించి సంతకాలు చేశారు. మరుసటి రోజు పొద్దున పదిగంటలకు ఆరుగురు వెళ్లి సీపీని కలిసి ఆ కాగితం ఇవ్వడానికి నిర్ణయించారు.

మరుసటి రోజు మామిడిచెట్ల కిందికి మళ్లీ చేరారు. అయితే నిన్నటి మీద సగంమంది మాత్రం ఉన్నారు. అందులో నిన్న రాలేకపోయిన కళ్యాణం ఉన్నాడు. అతను ఈ ఊళ్లో నెలలో రెండు మూడు రోజులు మాత్రం ఉంటూంటాడు. మిగతా రోజులలో వ్యాపార రీత్యా లోకసంచారం చేస్తూంటాడు. లోకాన్ని ఎక్కువగా చూస్తూంటాడు కాబట్టి లోక విధానం తనకు తెలిసినట్లుగా వీళ్లెవరికీ తేలీదని వారి నమ్మిక, అదే కాలనీవాసుల నమ్మిక కూడా. ఆయన అభిప్రాయం ఏ విషయంలోనూ నలభైమంది అభిప్రాయాలకు భిన్నంగా ఉండటం దాని ప్రత్యేకత. ఎవరూ చూడలేని కోణాలనుంచి ఆయన చూడగలడు. చూసి, చూసినది చెప్పి అందరినీ చకితులను చేయగలడు. అమూల్యమైన తన అభిప్రాయాలను ఎవరూ అడగకుండానే చెప్పటం తన ధర్మంగా భావిస్తాడు. ఈసారి ఆయన అభిప్రాయాన్ని ఎవరో అడిగారు. ఆయన దూరానికి తదేకంగా చూస్తూ గంభీరంగా చెప్పాడు.

"వాళ్లు ఎలాంటి కేసూ పెట్టకుండా వదిలేశారు. హింసించలేదు, అవమానించలేదు. పైగా కూర్చోడానికి కుర్చీ కూడా ఇచ్చారు. ఒక్క వెంట్రుక కూడా రాలకుండా పోలీసు స్టేషను నుంచి రాగలగటం ఒక వింత. అల్లరి పిల్లడిని గోడకుర్చీ వేయిస్తామే అల్లాంటి పని మాత్రమే పోలీసువారు చేశారు. మీరు నిజంగానే దాన్ని తీవ్ర విషయంగా పరిగణిస్తున్నారా? జాలిపడటం తప్ప నేనే చేయగలను? ఆల్ దట్ ఎండ్స్ వెల్ ఈజ్ వెల్ అని ఇంగ్లీషులో అంటారు. దుష్టుడ్ని చూసి దూరంగా జరగమని తెలుగులో అంటారు. ప్రస్తుత సందర్భానికి ఏది అన్వయించుకున్నా మంచిదే. ఆ విషయం అసలు జరగలేదని అనుకుంటే పోలా? అలా అనుకోలేకపోతే దాన్ని మరిచిపోయే ప్రయత్నమన్నా చేస్తే పోతుంది!"

"ఈ ఫిర్యాదు చేయటం వలన నష్టం లేదు గదా! జరిగిన అవమానానికి ప్రతిక్రియ చేశాం అన్న సంతృప్తి గురించైనా చేయాలి!"

అతి తెలివితక్కువ వాడి మాటకు అతితెలివిగలవాడు నవ్వినట్టు నవ్వి అన్నాడు కళ్యాణం "వాళ్లు వందనం సంతకం తీసుకున్న తెల్ల కాగితం మీద ఏదో నేరాన్ని అతను ఒప్పుకున్నట్లు రాస్తారు. మనం బాగానే ఉంటాం. పాపం, అతను నిజమైన చిక్కులో పడతాడు. వందనంగారిని మరోసారి అడగండి. చిన్నదే అయినా ఒక అన్యాయాన్ని ఎదుర్కొనటం నాకు ముఖ్యం, ఎలాంటి పరిణామానికైనా సిద్ధమే అని ఆయనంటే నేనూ మీతోపాటు కమిషనరేట్‌కు వస్తా, ఊరి ప్రయాణం మానుకుని మరీ!"

సమాధానం గురించి వందనంవైపు తిరిగారంతా.

"ఆలోచించి చెబుతా!" అన్నాడు బిక్కచచ్చిన వందనం.

"అయితే మళ్లీ కలుద్దాం!" అని విడిపోయారంతా.

పదిరోజులపాటు ఒకరికొకరు ఎదురుపడకుండా జాగ్రత్తపడ్డారు. ఒకవేళ ఎదురుపడ్డా మాట్లాడే అవకాశం ఒకరికొకరు ఇవ్వకుండా విష్ చేసుకుని అతి ముఖ్యమైన, తొందర పనిలో పోతున్నట్లు దూరమైపోయారు. ఆ తర్వాత ఆ విషయం మరిచిపోయినట్లు భావించుకున్నారు.

నెలరోజుల తర్వాత, ఆ విషయం మరిచిపోయినట్లు భావించుకోలేకపోయిన కరుణ, వందనం ఇంటికేసి దొంగ చూపులు చూస్తూ సుబ్బయ్యతో అన్నాడు

"ఆ చర్చలో పైకి రాలేకపోయినంత లోతుకు వెళ్లామేమోనండీ ...!"

■